క్లుప్తంగా

విద్యార్థికి అభినందనలు



విద్యార్థి ఉమేష్ గౌడు

కర్నూలు సిటీ: రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో వెండి పథకం సాధించిన నగర శివారులోని జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థి ఉమేష్‌గౌడును కళాశాల చైర్మన్ జి.వి.ఎం మోహన్ కుమార్ మంగళవారం అభినందించారు. ఇటీవల కర్నూలు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో తమ విద్యార్థి ప్రతిభ కనబరిచినట్లు ఆయన తెలిపారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు 'సెయింట్ జోసఫ్' విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న సీఈఓ రమణ

కర్నూలు (టౌన్): వచ్చే నెల 29 నుంచి నవంబర్ 4 వ తేదీ వరకు గోవా రాష్ట్రంలోని పనాజీ అక్వాటిక్ సెంటర్ కాంపెల్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు సెయింట్ జోసఫ్ జూనియర్ కళాశాల విద్యార్థిని సామియా తస్నీమ్ ఎంపికైంది. విద్యార్థినిని మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో సీఈఓ రమణ అభినందించారు. కార్యక్రమంలో స్విమ్మింగ్‌కోచ్ నటరాజరావు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు సిటీ: రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డులు అందుకున్న అధ్యాపకులను మంగళవారం సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో ఘనంగా సన్మానించారు. కళాశాల తెలుగు విభాగం అధ్యాపకురాలు డాక్టర్ ఫామిదా బేగం, ఆంగ్ల విభాగం అధ్యాపకురాలు డాక్టర్ హెచ్ అక్తర్‌భానులను స్టాఫ్, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ పాల్గొన్నారు.

'శ్రీలక్ష్మి' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న స్కూల్ చైర్మన్

కర్నూలు (టౌన్): ఈనెల 9న స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో శ్రీలక్ష్మి విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు సాధించారు. బాలికల విభాగంలో మనుశ్రీ, బాలుర విభాగంలో సాత్విక్, కృష్ణప్రియలు మొదటి స్థానంలో నిలిచారు. వీరిని మంగళవారం శ్రీలక్ష్మి స్కూల్ చైర్మన్ శ్రీనివాసరావు, సీఈఓ ఇందు, ప్రధానోపాధ్యాయులు సుశీల అభినందించారు.

16, 17 తేదీల్లో ఏఐటీడబ్ల్యూసీ సమావేశాలు



కరపత్రాలను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఆల్ ఇండియా ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ కౌన్సిల్(ఏఐటీడబ్ల్యూసీ) రాష్ట్ర స్థాయి సమావేశాలను ఈనెల 16, 17 తేదీలలో కర్నూలులో నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, కార్యదర్శి ఎండీ అంజిబాబు తెలిపారు. మంగళవారం కార్మిక, కర్షక భవన్‌లో సమావేశాల కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సమావేశాల్లో భాగంగా మొదటి రోజు నగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందన్నారు. సమావేశాల్లో జీఓ నంబర్ 21వ రద్దుతోపాటు ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై తీర్మానాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.ప్రభాకర్, బి.రాధాకృష్ణ, హుస్సేన్‌వలి, నాగరాజు పాల్గొన్నారు.

16న జిల్లాకు భారత యాత్ర

కర్నూలు సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ పునరుద్ధరించాలని కోరుతూ ఆల్ ఇండియా ప్రైమరీ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 5న భారత యాత్ర కన్యాకుమారి నుంచి ప్రారంభమైందని, ఈ యాత్ర ఈ నెల 16న జిల్లాకు చేరుకుంటుందని అప్టా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మధుసూదన్ రెడ్డి, సెవలాల్ నాయక్‌లు మంగళవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. 16న మధ్యాహ్నం కర్నూలులో యాత్ర ఉంటుందన్నారు. సీక్యాంపులోని లలితా కళాక్షేత్రంలో సమావేశం, అక్కడి నుంచి రాజ్‌విహార్, ప్రకాష్‌నగర్ మీదుగా ఈ యాత్ర తెలంగాణ రాష్ట్రంలోకి అడుగు పెడుతుందన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

• ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(సెంట్రల్): అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. మంగళవారం సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు ఆయన 43వ వార్డు 112 సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల లబ్ధిదారులను పలకరించారు. వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేస్తే ప్రజాసమస్యలన్నీ తీరిపోతాయన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు.

సీపీఎం కార్యాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే..

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలోభాగంగా ఎమ్మెల్యే ఇందిరాగాంధీ నగర్‌లో ఉన్న సుందరయ్య భవన్‌ను సందర్శించారు. అక్కడ ఉన్న జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, ఇతర నాయకులను పలకరించి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యాలయ సమీపంలో పందులు ఉంటున్నాయని, కాలువలు శుభ్రం చేయించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో నాయకులు రైల్వే ప్రసాదు, రాజేష్, వాహిదా, నాగేశ్వరరావు, రంగన్న, ప్రసాదు, షఫీ, రేణుక, సుశీల పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో ప్రజా దర్బార్‌ను నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. నగరంలోని పలు వార్డుల నుంచి అనేక మంది తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా...ఆయన మునిసిపల్, రెవెన్యూ, ఇతర శాఖలకు సంబంధించిన అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బాధితుడికి చెక్కు పంపిణీ



బాధితుడికి చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే

నగరంలోని 5వ వార్డుకు చెందిన షేక్షా ఇల్లు ప్రమాదవశాత్తూ అగ్నికి ఆహుతైంది. బాధితుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ పరామర్శించి సీఎంఆర్‌ఎఫ్ నిధుల కోసం దరఖాస్తు చేయించడంతో రూ.2 లక్షలు మంజూరయ్యాయి. మంగళవారం బాధితుడు షేక్షాకు ఎమ్మెల్యే చెక్కును అందజేశారు.

త్వరగా పూర్తి చేయండి

నగరంలోని జొహరాపురం బ్రిడ్జి సమీపంలో గడ్డలో నిర్మాణంలో ఉన్న పార్కు పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి అన్ని వసతులతో పార్కును అభివృద్ధి చేయాలన్నారు. ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఉపాధ్యాయుడిని నియమించాలి

కర్నూలు(సెంట్రల్): నగర పరిధిలోని జొహరాపురం అంబేద్కర్ మెమోరియల్ మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న సోషల్ టీచర్ పోస్టును భర్తీ చేయాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ టీచర్ లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. కలెక్టరేట్‌కు కూతవేట దూరంలో ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉండడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నాయకులు సి.నాగరాజు, విజయ్ పాల్గొన్నారు.

పరీక్షలకు 23 మంది గైర్హాజరు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న పీజీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలకు 23 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఆరు కేంద్రాల్లో పరీక్షలు జరుగుతుండగా 426 మంది గానూ 403 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో పీజీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పనులు నాణ్యతగా చేయండి

• కలెక్టర్ డాక్టర్ జి.సృజన



పునరుద్ధరణ పనులనుపరిశీలిస్తున్న కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని ఆధునీకరణ పనులను నాణ్యతగా చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులకు సూచించారు. సీపీఓ కార్యాలయంలో జరుగుతున్న పునరుద్ధరణ పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆధునీకరణ పనులను వీలైనంత త్వరగా, నాణ్యతా ప్రమాణాలతో చేయాలని సూచించారు. ఆమె వెంట సీపీఓ జేడీ ఎల్.అప్పలకొండ ఉన్నారు.

గడువులోపు స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి

కర్నూలు(సెంట్రల్): రీసర్వేకు సంబంధించి స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మండలాల ప్రత్యేకాధికారులు, హౌసింగ్, పీఆర్ ఇంజినీర్లతో వివిధ అభివృద్ధి పథకాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కో రోవర్‌కు 100 స్టోన్లను ప్లాంటేషన్ చేయాల్సి ఉందన్నారు. గూడూరు, కోడుమూరు మండలాలు స్టోన్ ప్లాంటేషన్‌లో వెనుకబడి ఉన్నాయన్నారు. ఆస్పరి, కోడుమూరు మండలాల్లో లక్ష్యం మేరకు రోజుకు ఐదారు ఇళ్ల స్టేజీ కన్వర్షన్ కూడా మారడం లేదని ఆయా ఎంపీడీఓలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కంప్లిషన్ స్థాయిలో గోనెగండ్ల, కౌతాళం, ఆదోని మండలాల్లో పురోగతి కనిపించకపోవడంతో సంబంధిత హౌసింగ్ ఏఈలను ప్రశ్నించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచాలన్నారు. సమావేశంలో జేసీ నారపురెడ్డి మౌర్య, హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీ సిద్దలింగమూర్తి, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

రోగుల మరణాలపై తరచూ సమీక్ష



మాట్లాడుతున్న డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగుల మరణాలపై ప్రతి నెలా రెండవ వారంలో సమీక్ష నిర్వహిస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి చెప్పారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో రోగుల మరణాలపై అయన సమీక్ష నిర్వహించారు. మరణాలను తగ్గించేందుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, చికిత్స లోటుపాట్లు, తీసుకోవాల్సిన చర్యల గురించి వైద్యులతో చర్చించారు. రోగులకు సంబంధించిన ప్రతి వ్యాధినిర్ధారణ పరీక్షలు, చికిత్సను కేస్‌షీట్‌లో నమోదు చేయాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, హెచ్ఓడీలు డాక్టర్ హరిచరణ్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ కొండారెడ్డి, డాక్టర్ ఇక్బాల్ హుసేన్, డాక్టర్ విజయానందబాబు, డాక్టర్ మాణిక్యరావు, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మైనర్ డ్రైవింగ్‌పై కొరడా

కర్నూలు: లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తూ స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన మైనర్ల తల్లిదండ్రులకు రవాణా శాఖ అధికారులు భారీ జరిమానా విధించారు. నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల 8న స్పెషల్ డ్రైవ్‌లో 14 మంది మైనర్లు వాహనాలు తోలుతూ పట్టుబడగా వారి వాహనాలను రవాణా శాఖ అధికారులకు అప్పగించగా ఒక్కో వాహనానికి రూ.12 వేల నుంచి రూ.14,200 దాకా మంగళవారం జరిమానా విధించారు.

మరో 20 వాహనాలు రవాణా శాఖకు అప్పగింత

స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం నగరంలోని సి.క్యాంప్, రాజ్‌విహార్, ఓల్డ్ ఈద్గా, ఫైవ్ రోడ్ జంక్షన్, సెయింట్ జోసెఫ్ సెంటర్లలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. లైసెన్స్ లేకుండా ద్విచక్ర వాహనాలపై త్రిబుల్ రైడింగ్ చేస్తున్న 20 మంది మైనర్లను అదుపులోకి తీసుకుని వారి వాహనాలను సీజ్ చేసి రవాణా శాఖ అధికారులకు అప్పగించారు. ఆరు మాసాలుగా మైనర్ డ్రైవింగ్‌పై నిరంతరం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నప్పటికీ, మైనర్లు, వారి తల్లిదండ్రుల్లో మార్పు రాకపోవడంతో తదుపరి చర్యల నిమిత్తం పట్టుబడిన వాహనాలను రవాణా శాఖ అధికారులకు అప్పగిస్తున్నట్లు ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం తెలిపారు.

కుక్కను కాపాడిన ఫైర్ సిబ్బంది



బావిలో పడిన కుక్కను కాపాడిన ఫైర్ సిబ్బంది

కర్నూలు: స్థానిక సంతోష్‌నగర్‌లో నాలుగు రోజుల క్రితం బావిలో పడిపోయి బయటకు రాలేక అవస్థ పడుతున్న కుక్కను ఫైర్ సిబ్బంది కాపాడారు. స్థానికుడు నితిన్ ఇచ్చిన సమాచారం మేరకు స్టేట్ అనిమల్ వెల్ఫేర్ బోర్డు మెంబర్ ఇద్రూస్‌ఖాన్ స్పందించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చి వారి సహకారంతో కుక్కను చాకచక్యంగా బయటకు తీశారు. నాలుగు రోజులుగా తిండి లేక బాధ పడుతున్న కుక్కకు నీరు, ఆహారం అందించి ఉపశమనం కల్పించారు. కార్యక్రమంలో ఏడీఎఫ్ఓ చిన్నబజారి, ఎల్ఎఫ్ జి.సురేష్ కుమార్ రెడ్డి, డీఓపీ హనుమంతు, ఫైర్‌మెన్లు నరసింహ, ప్రతాప్, కేశవ్ తదితరులు పాల్గొన్నారు. కర్నూలు డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ జయన్నకు స్టేట్ అనిమల్ వెల్ఫేర్ బోర్డు తరపున మహమ్మద్ ఇద్రూస్‌ఖాన్‌కు కృతజ్ఞతాపత్రాన్ని సమర్పించారు.

ఉద్యానవన పంటలపై దృష్టిసారించాలి

• డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి



జామ చెట్లను పరిశీలిస్తున్న పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

సి.బెళగల్: రైతాంగం ఉద్యావన పంటల సాగుపై దృష్టి సారించాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన ఏఈఓ లక్ష్మన్న, ఈసీ పృథ్వీరాజ్, టీఏలతో కలిసి మండలంలోని పోలకల్, గొల్లలదొడ్డి, సి.బెళగల్ గ్రామాలలో పర్యటించారు. ఉద్యానవన పంట సాగులో భాగంగా రైతులు నాటుకున్న జామ, కొబ్బరి పండ్ల తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పంటల సాగులో మెలుకువలను, పథకం ద్వారా అందే సహాయ సహకారాలను తెలియజేశారు. పండ్లు, పూల తోటల పెంపకాలకు ముందుకు వచ్చే రైతులుకు వంద శాతం సబ్సిడీపై మొక్కలను అందజేయడంతో పాటు నిర్వహణ ఖర్చులను సైతం ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా చెల్లిస్తుందని వివరించారు. అదేవిధంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, ఉపాధి సిబ్బంది, ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించిన పీడీ ఉపాధి పనుల నిర్వహణపై సూచనలు చేశారు. కూలీల పెండింగ్ వేతనాలు చెల్లింపు అయ్యేలా చూడాలని పీడీ సూచించారు. అదేవిధంగా చెత్త సేకరణ కేంద్రాలు, గోలకులం షెడ్ల నిర్మాణాలు, వేతనాల బిల్లులు వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

కర్నూలు (న్యూసిటీ): అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. కల్లూరు మండలం ఉల్లిందకొండలో రెండు టిప్పర్లలో రోడ్డు మెటల్‌ను రవాణా చేస్తున్నారనే సమాచారంతో విజిలెన్స్ అడిషినల్ డైరెక్టర్ బైరాగి నాయుడు ఆధ్వర్యంలో దాడి చేసి వాహనాలను పట్టుకున్నట్లు ఆయన మంగళవారం తెలిపారు. అలాగే తడకనపల్లె గ్రామంలో మట్టిని టిప్పర్‌లో తీసుకెళ్తుండడంతో తనిఖీ చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటిని ఉల్లిందకొండ పోలీసు స్టేషన్‌కు తరలించామన్నారు. విచారించి వాహనాల యజమానులకు జరిమానా విధిస్తామన్నారు.

క్వారీ గుంతలో పడి వ్యక్తి మృతి



మృతిచెందిన శోభనాథ్ సింగ్

కల్లూరు: తడకనపల్లె సమీపంలోని క్వారీ గుంతలో పడి మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శోభనాథ్ సింగ్ (31) అనే వ్యక్తి మృతిచెందాడు. మృతుడు నాగసుబ్బారెడ్డి క్వారీ వద్ద టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున టిప్పర్ లోడ్ చేసుకుని క్వారీలో నుంచి బయటకు వస్తుండగా ప్రమాదవశాత్తు గుంతలో పడిపోయాడు. మీద టిప్పర్ సైతం పడటంతో ఊపిరాడక ప్రాణాలొదిలాడు. ఈ మేరకు మృతుడి స్నేహితుడు జితేంద్ర సింగ్ ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఉలిందకొండ ఎస్ఐ నల్లప్ప వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్ఏ మృతి



నరసప్ప (ఫైల్)

మంత్రాలయం: మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన వీఆర్ఏ నరసప్ప రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాధవరం నుంచి రచ్చుమర్రి గ్రామానికి వెళ్తుండగా బాట మారెమ్మవ్వ గుడి వద్ద వీఆర్ఏ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ముందుగా వెళ్తున్న ఎద్దుల బండిని ఢీకొట్టింది. దీంతో నరసప్ప (40) అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మార్తమ్మ, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మాధవరం పోలీసులు ప్రమాదంపై విచారణ చేపట్టారు.

కోలుకోలేక వీఆర్వో మృతి

ఓర్వకల్లు: కాలినడకన వెళ్తూ ప్రమాదవశాత్తూ కిందపడి గాయపడిన కాల్వ వీఆర్వో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని లొద్దిపల్లె గ్రామానికి చెందిన గోవింద స్వామి(47) కాల్వ వీఆర్వోగా పనిచేస్తున్నాడు. ఈనెల 8న విధులు ముగించుకుని కాలి నడకన ఇంటికి వెళ్తుండగా కళ్లు తిరిగి పడిపోయాడు. తోటి ఉద్యోగులు వెంటనే కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాదుకు తరలించారు. అక్కడ కోలుకోలేక మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. విషయం తెలుసుకున్న పలువురు.. వీఆర్వో కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబసభ్యులు మృతుడి అవయవాలను దానం చేశారు. కాగా ఒత్తిళ్ల కారణంతోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు.

'సుంకేసుల'కు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎగువ నుంచి రిజర్వాయర్‌కు మంగళవారం 375 క్యూ సెక్కుల వరద నీటి ఇన్ ఫ్లో ఉంది. కేసీ కాల్వకు 331 క్యూసెక్కులు విడుదల చేశారు. డ్యామ్ పూర్తి స్థాయి నీటి నిల్వ స్థామర్థ్యం 1.20 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు వివరించారు. దిగువకు నీటి విడుదల నిలిపివేశామని పేర్కొన్నారు.

పిల్లిగుండ్లలో డెంగీ నిర్ధారణ

గోనెగండ్ల: మండల పరిధిలోని పిల్లిగుండ్లలో రెండు డెంగ్యూ కేసులు నమోదైనట్లు జిల్లా మలేరియా అధికారి నూకరాజు తెలిపారు. మంగళవారం వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించి నీళ్లు నిల్వ ఉన్న చోట శుభ్రం చేయించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇళ్లలోని బకెట్, డ్రమ్ములు, గచ్చులలో నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచుకోరాదన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డెంగీ బాధితుల ఇళ్లకు వెళ్లి దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. డివిజన్ మలేరియా అధికారి సాయిబాబా, సూపర్‌వైజర్ హనుమంతు, పరమేష్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు ఉన్నారు.

వైద్యసేవలను ఉపయోగించుకోవాలి

• జిల్లా ఎస్పీ కృష్ణకాంత్



వైద్యులతో కలిసి హెల్త్ చెకప్ ప్యాకేజీని విడుదల చేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: వైద్యసేవలను ఉపయోగించుకోవాలని ఎస్పీ కృష్ణకాంత్ సూచించారు. మంగళవారం జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ వైద్యులు హెల్త్ చెకప్ ప్యాకేజీని ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ అందించే సేవలు ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే ఈ ప్యాకేజీ పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ ఎండీ డాక్టర్ చంద్రశేఖర్, చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ డాక్టర్ గణేష్, డాక్టర్ రాఘవేంద్ర, జనరల్ మేనేజర్ నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగికి బదిలీ సర్వసాధారణం

కర్నూలు: ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సర్వసాధారణమని, విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని ఎస్పీ కృష్ణకాంత్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయ పరిపాలనాధికారి (ఏఓ) కె.సురేష్ బాబు అమరావతిలోని డీజీపీ హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి జిల్లా పోలీసు శాఖ తరపున డీపీఓలో ఆయనకు శాలువా కప్పి సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు సురేష్ బాబు సేవలను కొనియాడారు. అడిషనల్ ఎస్పీలు కృష్ణకాంత్ పటేల్, టి.సర్కార్, నాగబాబు, హోంగార్డ్స్ సదరన్ రీజియన్ కమాండెంట్ మహేష్ కుమార్, కర్నూలు డీఎస్పీ విజయ శేఖర్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు, డీపీఓ పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు సిటీ: క్రమ శిక్షణతో కూడిన విద్యను నేర్చుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ విద్యార్థులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కాలేజీలో మంగళవారం నిర్వహించిన వెల్‌కం పార్టీకి ఎమ్మెల్యే ఎం.ఏ హఫీజ్‌ఖాన్, ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్య శెట్టి హాజరై ప్రసంగించారు. చదువతో పాటు విద్యార్థులకు క్రీడల్లో మెలకువలు నేర్పాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సుంకన్న, రిటైర్డ్ ప్రిన్సిపాల్ చెన్నయ్య, కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.





పరిపాలనా విభాగంలో ఊడిపడిన పెచ్చులు, థర్మాకోల్ పలకలు

ఆసుపత్రిలో ఊడిన పెచ్చులు

• సిబ్బందికి తప్పిన ప్రమాదం

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాల భవనంపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెళ్ల కారణంగా పలు చోట్ల పెచ్చులు ఊడుతున్నాయి. తాజాగా ఆసుపత్రిలోని పరిపాలనా విభాగంలో సిబ్బంది కూర్చునే హాలులో పెచ్చులు ఊడిపడ్డాయి. కొంతకాలంగా రూఫ్ లీకేజ్ అవుతూ ఉండగా తాజాగా పెచ్చులు ఊడిపడటంతో పాటు దాని కింద ఏర్పాటు చేసిన థర్మాకోల్ పలకలు కింద పడిపోయాయి. ఆ సమయంలో ఉద్యోగులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. గత ప్రభుత్వంలో ఓ కంపెనీ భవనంపై సోలార్‌ప్యానెళ్ల నిర్వహించే క్రమంలో డ్రిల్లింగ్ చేయడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వక్కెర వాగుపై బ్రిడ్జి నిర్మించాలి



సంతకాలు సేకరిస్తున్న నాయకులు

కల్లూరు: వక్కెర వాగుపై కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టి, ఎత్తు పెంచి చుట్టూ వరద రక్షణ గోడలు నిర్మించాలని డివైఎఫ్ఐ, ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ ఆధ్వర్యంలో వక్కెర వాగు వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. కర్నూలు, కల్లూరు ప్రాంతాలను ఈ బ్రిడ్జి కలుపుతుందన్నారు. బ్రిటిష్ కాలం నాటి పురాతన బ్రిడ్జి అని, రోజులు మారుతున్నా బ్రిడ్జి రూపురేఖలు మారడం లేదన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకు

• కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): ప్రజా సమస్యల పరిష్కారానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం 40వ వార్డు బాలాజీ నగర్‌లో కార్పొరేటర్లు విక్రమసింహారెడ్డి, గిప్సన్, సాంబతో కలిసి పర్యటించారు. ఇంటింటికి వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా కోడుమూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల లబ్ధిని అర్హులైనవారందరికీ అందజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి వద్దకే ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ పాలన కొనసాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోన్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంతాపం

కర్నూలు (న్యూటౌన్): నగరంలోని స్టాంటన్‌పురానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఖాజా (30) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ స్టాంటన్‌పురంలోని ఖాజా నివాసానికి వెళ్లి మృతదేహంపై పూల మాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతిని తెలియజేసి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యేతో పాటు జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోన్, కార్పొరేటర్ సాంబ, సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.